క్లుప్తంగా

నేడు 'లోక్ కళ్యాణ్ మేళా'

రాయదుర్గంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెప్మా ఆధ్వర్యంలో 27న శనివారం స్థానిక బళ్లారి రోడ్డులోని సీతారామ కళ్యాణమంటపంలో 'లోక్ కళ్యాణ్ మేళా' నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. వీధి విక్రయదారులకు (ఫుట్‌పాత్ వ్యాపారులు) లోన్ దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడమే లోక్ కళ్యాణ్ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు. రుణ మంజూరు దరఖాస్తులను బ్యాంకర్లు స్వీకరిస్తామన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: అరటి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 27వేల ఎకరాల్లో దాదాపుగా ఆరు లక్షల మెట్రిక్ టన్నుల పంటను రైతులు పండిస్తున్నారన్నారు. గతేదాది ఇదే సీజన్‌లో టన్ను 20 వేలు ఉండేదని, ఇప్పుడు కనీసం 5 వేలు కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వం టన్ను రూ.15 వేలుగా మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అరటి రైతులకు హెక్టారుకు రూ.33 వేలు సబ్సిడీ అందజేసిందని, కూటమి ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ అమలు చేయలేదని వాపోయారు.

గ్రామ సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామ సచివాలయాన్ని కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సమిత్వ సర్వేలో ఉంతకల్లు గ్రామంలో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. బందూరు గ్రామ సమిత్వ సర్వే ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ దాస్, పంచాయతీ కార్యదర్శి పల్లవి పాల్గొన్నారు.


హామీల అమలులో 'కూటమి' విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూరి విమర్శించారు. శుక్రవారం వర్లీ గ్రామంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించారన్నారు. ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోందని, ఈ ఘనత స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. అనంతరం వర్లీ పంచాయతీలో నూతన వైఎస్ఆర్‌సీపీ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మల్లి, జేసీఎస్ మండల కన్వీనర్ అంజి, మున్సిపల్ విభాగం నేత దొడగట్ట మురళి, బోరంపల్లి రామిరెడ్డి, పార్టీ సీనియర్ నేత లోకేష్ రెడ్డి, రమేష్, తలారి పెద్దన్న, మారుతి, వన్నప్ప, జయరాంనాయక్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీకాతో పశు సంరక్షణ



గాలికుంటు వ్యాధి సోకితే గేదెలు, ఎద్దుల్లో వచ్చే లక్షణాలు



బొమ్మనహాళ్‌లో గాలికుంటు టీకా వేస్తున్న పశువైద్యుడు

- జాగ్రత్తలతో గాలికుంటును తరిమేద్దామంటున్న పశువైద్యులు
- అక్టోబర్ 15వ వరకు వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్

బొమ్మనహాళ్/రాయదుర్గంటౌన్: పశువుల్లో పీడిస్తున్న అంటువ్యాధుల్లో ప్రమాదకరమైనది గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్). కలుషిత గాలి ద్వారా సోకే గాలికుంటు వైరస్ ఒకప్పుడు మార్చి నుంచి సెప్టెంబర్ మధ్య వ్యాపించేది. ఇటీవల కాలంలో ఏడాది పొడవునా పశువులను పీడిస్తోంది. దేశవాళి పశువుల్లో కన్నా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత అధికంగా ఉందని, టీకాతో గాలికుంటు వ్యాధి నివారించొచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 15 వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని చెప్తున్నారు. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం డివిజన్ల పరిధిలో మొత్తం 2,16,586 ఆవులు, ఎద్దులు, గేదెలు ఉన్నట్లు అధికారిక రికార్డులు చెప్తున్నాయి. వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, టీకా ఆవశ్యకతను తెలియజేస్తూ పశు సంపదను ఏ విధంగా కాపాడుకోవాలో పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు..

వ్యాధి సోకినప్పుడు పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి. మేత మేయవు. పాలిచ్చే పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. ఒకటి లేదా రెండు రోజుల్లో జ్వరం తగ్గినా నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, నోటి నుంచి జొల్లు కారుతుంది. గిట్టల మధ్యన పుండ్లు ఉండడం వల్ల పశువులు సరిగా నడవలేవు. వెంటనే పశువైద్యులను సంప్రదించాలి.

చికిత్స విధానం ఇలా..

పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో గిట్ల మధ్య పుండ్లను బాగా శుభ్రం చేయాలి. నోటిలోని పుండ్లను ఉప్పు నీటితో కడగాలి. బోరిక్ పౌడర్, గ్లిజరిన్ పేస్ట్‌ను పూత మందుగా రాయాలి. నోటి పుండ్లతో మేతమేయలేవు. మెత్తటి పదార్థాలను రాగి జావ తాగించడం, గంజి లాంటి పదార్థాలను మేతగా ఇవ్వాలి. పుండ్లపై ఈగలు వాలకుండా యాంటీ సెప్టిక్ ఆయింట్‌మెంట్‌లను ఉపయోగించాలి. వ్యాధి సోకిన తర్వాత మందులు వాడినా తక్కువ ఫలితాలు ఇస్తాయి. ముందస్తు టీకా వేయించాలి. గాలికుంటు వ్యాధి సోకుండా ఉండేందుకు టీకా రెండు దఫాలుగా అంటే ఆరు నెలలకోసారి వేయించుకోవాలి. చిన్నపాటి జ్వరం, పాలు తగ్గినప్పటికి అధైర్యపడకుండా టీకాలు వేయించుకుంటే పశువుల్లో ఈ వ్యాధి వ్యాపించకుండా నివారించొచ్చు. నాలుగు నెలలు ఆపై వయస్సు ఉన్న దూడలు, పశువులకు టీకా వేయించాలి.

టీకాతో ఎంతో ప్రయోజనం

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ప్రత్యేక టీకా కార్యక్రమం పెట్టారు. గ్రామాల్లో పాడి రైతులు తమ ఆవులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాతో పాడి పశువుల్లో వ్యాధి నిరోధకతను పెంచి పాల ఉత్పత్తిని తగ్గకుండా కాపాడుకోవచ్చు. ఎద్దుల్లో పనిచేసే సామర్థ్యాన్ని తగ్గకుండా చూసుకోవచ్చు. దూడల్లో ఈ వ్యాధి మరణాలు నివారించొచ్చు. టీకా వేసేందుకు గ్రామాల్లో ఒక రోజు ముందుగానే చాటింపు వేయిస్తాం. పశువుల పెంపకందారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సూర్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, పశువైద్యాధికారులు, రాయదుర్గం, బొమ్మనహాళ్

కరుణించు.. చౌడేశ్వరీదేవీ



కళ్యాణదుర్గంలో ధనలక్ష్మి అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు

సాక్షి బృందం: దసరా ఉత్సవాలు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆయా ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో శుక్రవారం 16వ వార్షికోత్సవం(జయంతి) వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం, కుంకుమార్చన, అర్చనలు, లలితాహోమం, రుద్రహోమం, గణపతిపూజ, నవగ్రహ పూజ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో అర్చకుడు దత్తాత్రేయశర్మ, భక్తులు పాల్గొన్నారు.




అలంకరణలో లలితా త్రిపుర సుందరీదేవి



బొమ్మనహాళ్: కరెన్సీ నోట్ల అలంకరణలో కన్యకాపరమేశ్వరి



గుమ్మఘట్ట: లక్ష్మీదేవిగా రుద్రకాళి



రాయదుర్గం: ధనలక్ష్మిగా చౌడేశ్వరీదేవి



రాయదుర్గం: అలంకరణలో పెద్ద బన్నీ మహంకాళి



కణేకల్లు: మహాలక్ష్మిగా దుర్గాదేవి



ఉరవకొండలో మహలక్ష్మి అలంకరణలో జగదీశ్వరి



ధనలక్ష్మి దేవి రూపంలో పెన్నహోబిలం ఉద్భవ మహాలక్ష్మి



బెళుగుప్పలో మహాలక్ష్మి అలంకరణలో మంజునాథస్వామి



ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో మహలక్ష్మి అలంకరణ

పేదల సంక్షేమాన్ని కాలరాసిన కూటమి



కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా పేదలను వంచనకు గురిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని 15, 16 వార్డుల్లో కౌన్సిలర్ శ్రీలక్ష్మీ, వార్డు ఇన్‌చార్జ్ గంగాధర్, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు గడప గడపకూ వెళ్లి కూటమి చేస్తున్న మోసాలు, ఎగ్గొట్టిన హామీలను ప్రజలకు వివరించారు. కౌన్సిలర్లు శారదాదేవి, గౌని లావణ్య, పైతోట సంజీవప్ప, ఐనాపురం మంజునాథ, ఫకృద్దీన్, కోప్షన్ సభ్యుడు నజీర్, మాజీ కౌన్సిలర్ రఘురాం, వార్డు ఇన్‌చార్జ్‌లు బషీర్ అహ్మద్, రామాంజనేయులు, గోనబావి నిజాముద్దీన్, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, బడిగి బషీర్, జలంధర్‌రెడ్డి, బంగి రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, అల్తాఫ్, ప్రవీణ్, కొలిమి ఆనంద్, మల్లి, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంగా ఉండాలి

రాయదుర్గంటౌన్: పారిశుధ్య కార్మికులు తరుచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రారెడ్డి

రాయదుర్గం: అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాయదుర్గం మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రారెడ్డి విమర్శించారు. శుక్రవారం తన నివాసంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శివపుత్ర, నాయకుడు గౌని శ్రీరామిరెడ్డి, పాటిల్ వెంకటరెడ్డిలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ.. శాసనసభలో బాలకృష్ణ వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోందన్నారు. జేబులో చేతులుపెట్టుకుని, సభా మర్యాదలు పాటించకుండా ఏక వచనంతో మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. మానసిక రోగిలా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవిని వాడు, వీడు అంటూ ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యవహరించారన్నారు. అన్నయ్యపై అభిమానం ఉండే తమ్ముడు పవన్ కళ్యాణ్ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.

సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యం





ఉదయం 11 గంటలైనా తెరవని తిమ్మసముద్రం సచివాలయం, వేచిచూస్తున్న రైతులు

కళ్యాణదుర్గం రూరల్: తిమ్మసముద్రం సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 11 గంటలైనా హాజరు కాలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు సచివాలయం బయటే పడిగాపులు కాయాల్సి వచ్చింది. శుక్రవారం మాత్రం ముగ్గురు సెలవు పెట్టారు. మిగిలిన ఏడుగురు ఉదయం 12 గంటలకు విధులకు హాజరయ్యారు. ఈక్రాప్ బుకింగ్ నేపథ్యంలో రైతులు ఉదయం 9 గంటల నుంచి సచివాలయం వద్ద వేచి ఉన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ శిల్ప మధ్యాహ్నం 12 గంటలకు వచ్చింది. సమయపాలన పాటించాలని రైతులు అధికారులకు నిలదీయడంతో సచివాలయ సిబ్బంది పొంతనలేని వారు సమాధానం చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

వైద్యులను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అందక ఐదేళ్ల బాలుడు అహరోన్‌కుమార్ మృతికి కారణమైన వైద్యుడితో పాటు ఏఎన్ఎంలను సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, మండల రూరల్ కన్వీనర్ ఎర్రిస్వామిరెడ్డి మాట్లాడుతూ ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండలో పేదలకు వైద్యం కూడా అందడం లేదన్నారు. 50 పడకల ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, పరికరాలు కూడా లేకపోవడం దారుణమన్నారు. ఎలాంటి కేసులు ఆస్పత్రికి వచ్చినా అనంతపురానికి రెఫర్ చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా ఆగిపోతే జనరేటర్‌కు కుడా దిక్కులేదన్నారు. మంత్రి కేశవ్‌కు ఉరవకొండలో సమస్యలు ఏమాత్రం కన్పించడం లేదని, ఆయన అమరావతికే పరిమితమయ్యాడన్నారు. వైద్యం అందక బాలుడు మృతి చెందిన ఘటనలో వైద్యులు, ఏఎన్ఎంతో పాటు వైద్యులపై పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యం వహించినా సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుద్దాల వెంకటేష్, మూలగిరిపల్లి ఓబన్న, ఈశ్వర్, వేమన్న, శర్మాస్, పచ్చి రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బ్రహ్మసముద్రం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పిల్లలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

104 వాహన సేవలపై ఆకస్మిక తనిఖీ

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లిలో శుక్రవారం 104 వాహనం సేవలు అందిస్తుండగా సంస్థ రీజనల్ మేనేజర్ ఇక్బాల్, డీఎం కిషోర్ నాయుడుతో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. వాహన సేవలపై స్థానికులతో ఆరా తీసారు. అనంతరం వాహనంలో మొబైల్ మెడికల్ యూనిట్, వాహన ఎక్యూప్‌మెంట్‌లను, రికార్డులను పరిశీలించారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

రాయదుర్గంటౌన్: అసెంబ్లీ సాక్షిగా మెగాస్టార్ చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని రాయదుర్గం ఆల్ మెగా ఫ్యామిలీ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ శ్రీహరికృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తనను తాను ఓ అతీతశక్తిగా భావిస్తూ నందమూరి బాలకృష్ణ మెగా కుటుంబంపై గతంలో కూడా పలుమార్లు అవమానకరమైన రీతిలో మాట్లాడారన్నారు. మెగా అభిమానులుగా బాలకృష్ణ వైఖరి, వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రామ సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం : పిల్లలపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఉమాదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ రికార్డులు, సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం గ్రామ పంచాయితీలో నెలకొన్న ప్రధాన సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం సమీపంలోని చెరువు కట్ట వద్ద శుక్రవారం పట్టణానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 288 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సోమశేఖర్ తెలిపారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో 29న సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లిలో సుజాత శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులతో గొడవపడి క్రిమిసంహారక మందు తాగి ఇంట్లోనే కుప్పకూలారు. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సలకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యం ధ్వంసం

ఉరవకొండ(విడపనకల్లు): వివిధ కేసుల్లో పట్టుబడ్డ అక్రమ మద్యం, నాటుసారాను అనంతపురం ఎక్సైజ్ ఏఈఎస్ రేవతి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఉరవకొండ–గుంతకల్లు రహదారి వద్ద 6.6 లీటర్ల నాటుసారా, ఎన్‌డీపీఎల్ 8.1 లీటర్లు, టెట్రా ప్యాకెట్లు ధ్వంసం చేశారు. అలాగే విడపనకల్లు మండల సరిహద్దు ప్రాంతంలో ఉన్న విడపనకల్లు, డోనేకల్లు చెక్‌పోస్టులను శుక్రవారం ఏఈఎస్ రేవతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కర్ణాటక నుంచి ఏపీలోకి వచ్చే పలు వాహనాలను అధికారులతో కలసి ఆమె తనిఖీ చేశారు. అనంతరం విడపనకల్లులోని వైన్‌షాపును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉరవకొండ ఎక్సైజ్ సీఐ రవిచంద్ర, ఎస్ఐ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని బోరంపల్లి గ్రామ సర్పంచ్ శోభరాణి కోరారు. ఈమేరకు శుక్రవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయకపోవడంతో విదేశాల నుంచి నిధులు రాక సంస్థ ప్రజలకు సేవలందించలేకపోతోందన్నారు. కేంద్రం వెంటనే ఆర్డీటీ సేవలను పునరుద్ధరించేలా చూడాలని కోరారు.

తాగునీటి పథకం ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్: రాళ్లపల్లిలో ఆర్డీటీ సహకారంతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని శుక్రవారం ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ సుబ్బరావు ప్రారంభించారు. రాళ్ళపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్డీటీ సంస్థ ముందుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరినాథ్, ఆర్డీటీ ఎటీఎల్ సురేష్, వైఎస్ఆర్‌సీపీ నేత భీమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఉరవకొండ: ఉరవకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన ఆరు వాహనాలను శుక్రవారం అనంతపురం అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. మూడు ద్విచక్రవాహనాలకు రూ.15,800 రాగా, అదనంగా జీఎస్టీ ద్వారా రూ.2,842 ఆదాయం సమకూరింది. తక్కిన మూడు వాహనాలను ఎవరూ బిడ్డింగ్‌కు రాలేదు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రవిచంద్ర పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బ్రహ్మసముద్రం: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వక్తలు పేర్కొన్నారు. బొమ్మగానిపల్లి, పిల్లలపల్లిలో శుక్రవారం స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ డాక్టర్ అఫ్తాబ్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమాదేవి, సర్పంచ్ తలారి గోవిందప్ప, ఆదినారాయణరెడ్డి, పీహెచ్ఎన్ రాణీ ఎస్తేర్, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, దీప్తి, ఏఎన్ఎంలు వన్నూరమ్మ, ఉమా, రోజా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో వెలసిన కేఎస్‌సీసీ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న జరిగే చర్చి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంఘ క్షేమాభివృద్ధి సదస్సు నిర్వహిస్తున్నట్లు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో చర్చి సభ్యులతో కలిసి సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సదస్సును చర్చి సమీపంలోని తోట స్థలంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

బొమ్మనహాళ్ ఏపీఎంగా గంగన్న

బొమ్మనహాళ్: మండల ఏపీఎంగా ఎంసీ గంగన్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రాయదుర్గంటౌన్: మహిళల ఆరోగ్యం కుటుంబానికి బలమైన ఆధారం అని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కోట మారెమ్మగుడి ఏరియాలో మహిళలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు, పరిసరాల శుభ్రత, ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించారు. మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు.

యువకుడి బలవన్మరణం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం సమీపంలో గురువారం రాత్రి రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ స్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని అనంతపురం జిల్లా కంబదూరు మండలం తిప్పేపల్లి గొల్ల విజయకుమార్ (25)గా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జీఎస్టీ శ్లాబుల తగ్గింపుతో ఊరట

కూడేరు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌లను తగ్గించడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల ప్రజలకు ఖర్చు భారం తగ్గుతుందని జిల్లా జీఎస్టీఓ ఆఫీసర్ ఎన్‌బి. అరుణ అన్నారు. జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపుతో ప్రజలకు కలిగే లబ్ధిపై శుక్రవారం కూడేరులో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంస్కరణల్లో భాగంగా ఈ నెల 22 నుంచి 5 శాతం, 18 శాతం 2 శ్లాబ్‌లను మాత్రమే అమల్లోకి తెచ్చిందన్నారు. దీంతో నిత్యావసర సరుకులు, వస్తువులపై పన్ను భారం తగ్గించడంతో ప్రజలకు ఖర్చుల ఆర్థిక భారం తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి. ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగాలు పారదర్శకంగా నిర్వహించండి

కణేకల్లు: పంటకోత ప్రయోగాలను పారదర్శకంగా చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారి జగదీష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎంపీఈఓలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో శుక్రవారం ఏఓ, ఇన్‌చార్జ్ ఏఎస్ఓ హేమావతిలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.